సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం | 26 | మార్చి | 2025

I



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదానం ట్రస్టుకు దిగుమర్తి పద్మావతి, శ్రీనివాస్ దంపతులు (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళంగా అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహర్ గురువారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.42
కాకినాడ	6.24	4.41
అమలాపురం	6.24	4.41

న్యూస్‌రీల్

వెంకన్న రథానికి రూ.లక్ష అందజేత

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాల్లో ఊరేగే రథానికి రంగులు, మరమ్మతుల కోసం రాజమహేంద్రవరానికి చెందిన మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామమోహనరావు కుమారులు రాజా, గణేష్ రూ.లక్ష సమకూర్చారు. ఈ మొత్తాన్ని జక్కంపూడి గణేష్ బంధువు స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యుడు మోకా వెంకట సుబ్బారావుకు మంగళవారం అందజేశారు. రామ్మోహనరావు భార్య జక్కంపూడి విజయలక్ష్మి, కుమారులు రాజా (మాజీ ఎమ్మెల్యే), గణేష్‌లకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకన్న కల్యాణానికి కుంకుమ భరిణల అందజేత

ఏప్రిల్ 7న జరగనున్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను వీక్షించేందుకు ప్రత్యేక టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు 350 కుంకుమ భరిణలు, 350 జాకెట్ ముక్కలను మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు సమకూర్చారు. డాక్టర్ వెంకటేశ్వరరావుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

28న రేషన్ బియ్యానికి వేలం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/దేవరపల్లి: జిల్లాలోని ఆరు కేసులలో సీజ్ చేసిన 47.274 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యానికి ఈ నెల 28న బహిరంగ వేలం వేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గోపాలపురంలోని మండల స్థాయి స్టాక్ పాయింట్ వద్ద ఈ వేలం నిర్వహిస్తామన్నారు. కిలో బియ్యం ధర రూ.25గా నిర్ణయించామన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు జీఎస్‌టీ లైసెన్స్ కలిగి ఉండాలని, ముందుగా రూ.2 లక్షల ధరావత్తును 'జాయింట్ కలెక్టర్, తూర్పు గోదావరి జిల్లా' పేరిట డీడీ రూపంలో చెల్లించి, వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. పాట వాయిదాకు, నిలుపుదలకు లేదా పూర్తిగా రద్దు చేయడానికి జిల్లా యంత్రాంగానికి అధికారాలున్నాయని తెలిపారు.

యూత్ పార్లమెంట్‌కు ఎంపిక



సాయిప్రదీప్

ఏలేశ్వరం: రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2025కు ఏలేశ్వరానికి చెందిన సాయిప్రదీప్ ఎంపికయ్యాడు. ఏపీ అసెంబ్లీలో జరిగే యూత్ పార్లమెంట్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి అతడు ప్రాతినిధ్యం వహిస్తాడు. కోస్తాంధ్ర నుంచి పలువురు విద్యార్థులు ఒక నిమిషం వీడియోను మై భారత్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీని ఆధారంగా విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో ఈ నెల 24న యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఎంపిక ప్రక్రియ జరిగింది. వీరిలో సాయిప్రదీప్‌ను టాప్–10లో ఒకరిగా ఎంపిక చేశారు. భారత రాజ్యాంగ వ్యవస్థపై ఈ నెల 28న అసెంబ్లీలో స్పీకర్ ముందు సాయిప్రదీప్ ప్రసంగించనున్నాడు. అతడిని పలువురు అభినందించారు.

హుండీల ద్వారా స్వామి ఆదాయం రూ.26,48,813

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారికి భక్తుల నుంచి వివిధ హుండీల ద్వారా మొత్తం రూ.26,48,813 ఆదాయం వచ్చింది. ఫిబ్రవరి 14వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ 39 రోజులకు గాను అధికారులు నిర్వహించిన హుండీల లెక్కింపులలో పై ఆదాయం స్వామికి వచ్చింది. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు లెక్కింపు నిర్వహించారు. మెయిన్ హుండీల ద్వారా రూ.25,86,985, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.20,676, అన్నదానం హుండీ ద్వారా రూ.41,152 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్, ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

బీసీ సాధికార సంస్థ అధ్యక్షుడిగా గుబ్బల

మలికిపురం: బీసీ సాధికార సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా మలికిపురానికి చెందిన గుబ్బల సత్యనారాయణ (బాబ్జీ) నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ అధ్యక్షుడు కె.కొండలరావు చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సమాఖ్యను సమర్థంగా నడిపిస్తానని బాబ్జీ మంగళవారం మలికిపురంలో తెలిపారు.

ఫుల్లుగా.. దోపిడి!

- ఇప్పటికే ఒక్కో సీసాపై రూ.10 పెంచిన ప్రభుత్వం
- మరో రూ.10 నుంచి రూ.40 వరకూ అదనంగా గుంజుతున్న మద్యం సిండికేట్
- ఆర్‌టీజీఎస్ సర్వేలో వెల్లడి
- అధిక వసూళ్లు చేస్తున్నారని 87 శాతం మంది అభిప్రాయం



సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి పెద్దల నేతృత్వంలోని సిండికేట్ మద్యం విక్రయాల్లో అడ్డగోలు వ్యవహారానికి తెర తీసింది. ఎంఆర్‌పీపై అదనంగా బాదేస్తూ దోపిడీకి పాల్పడుతోంది. ఇప్పటికే ప్రభుత్వం బీర్లు మినహా మిగిలిన అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లకు ఒక్కో సీసాపై అధికారికంగా రూ.10 పెంచింది. ఈ మేరకు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్‌ఈటీ)ను సవరిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇది చాలదన్నట్లు మద్యం సిండికేట్ ప్రతి బాటిల్‌పై మరో రూ.10 నుంచి రూ.40 వరకూ అదనంగా వసూలు చేస్తూ, మందుబాబులను కొల్లగొడుతోంది. ఇలా ప్రతి నెలా రూ.లక్షల్లో అక్రమంగా ఆర్జిస్తోంది. స్వయంగా ప్రభుత్వమే నిర్వహించిన ఆర్‌టీజీఎస్ సర్వేలో ఈ విషయం బహిర్గతమైంది.

సర్వే చేశారిలా..

మద్యం విధానం, విక్రయాలపై ప్రభుత్వం తాజాగా వాట్సాప్, ఐవీఆర్‌ఎస్ తదితర విధానాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు సంధించింది. 'మీ పరిసర ప్రాంతాల్లోని మద్యం షాపుల్లో ఎంఆర్‌పీకే మద్యం విక్రయిస్తున్నారా? లేదా? అని ప్రశ్నించగా.. 87 శాతానికి పైగా ప్రజలు ఎమ్మార్పీ ఉల్లంఘించి మరీ మందుబాబులను దోచుకుంటున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిసింది. మద్యం నాణ్యత, మద్యం బ్రాండ్లన్నీ అందుబాటులో ఉన్నాయా? లేదా? మద్యం ధరలు తగ్గాయా? అనే విషయమై కూడా ప్రభుత్వం ఆరా తీసింది. వీటిలో అనుకూల సమాధానం రాగా.. ఎంఆర్‌పీ ఉల్లంఘన, అధిక ధరలకు విక్రయాల విషయంలో మాత్రం ప్రభుత్వానికి తీవ్రంగా వ్యతిరేకత ఎదురైంది. ఆర్‌టీజీఎస్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమవారం నిర్వహించిన సమీక్షలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. స్వయంగా ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే మద్యం సిండికేట్ దోపిడీ వ్యవహారం బట్టబయలైందంటే.. ఇక అనధికారికంగా ఏ మేరకు దోచుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. అధికారంలోకి వస్తే తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ధరల పెంపు, అదనపు వసూళ్లతో మందుబాబులను బెంబేలెత్తిస్తోంది.



బెల్టుషాపుల్లో మరింతగా..

అక్రమార్జనే ధ్యేయంగా కూటమి మద్యం సిండికేట్ అడ్డదారులు తొక్కుతోంది. మద్యం దుకాణాలకు అనుగుణంగా బెల్ట్ షాపులు పెట్టుకుని దందా నడుపుతున్నారు. ప్రతి మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 10 నుంచి 20 బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. గతంలోనే ఎంఆర్‌పీ కంటే ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకూ వసూలు చేశారు. ప్రస్తుతం సీసాపై ప్రభుత్వం రూ.10 పెంచడంతో సిండికేట్ సైతం బెల్ట్ షాపుల్లో ధరలు పెంచేసి, రూ.40 నుంచి రూ.50 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు.

రూ.లక్షల్లో భారం

రాజమహేంద్రవరం రూరల్ ఐఎంఎల్ డిపో నుంచి జిల్లాలోని రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్‌తో పాటు అల్లూరి సీతారామరాజు, కోనసీమ జిల్లాల పరిధిలోని 134 మద్యం షాపులు, 27 బార్ అండ్ రెస్టారెంట్లకు మద్యం, బీర్లు సరఫరా చేస్తున్నారు. ప్రతి నెలా దాదాపు 1.17 లక్షల వివిధ రకాల మద్యం కేసులు, 44,300 బీర్ కేసులు సరఫరా చేస్తూంటారు. వీటి విలువ రూ.103 కోట్లు. ఒక్కో సీసాపై రూ.10 మాత్రమే అదనంగా వసూలు చేస్తున్నారనుకున్నా.. మద్యంపై రూ.11.70 లక్షలు, బీర్లపై రూ.4.43 లక్షల మేర అదనపు భారం మందుబాబులపై పడుతోంది.

- చాగల్లు ఐఎంఎల్ డిపో పరిధిలో జిల్లాలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలుతో పాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, ఏలూరు పరిధిలోని 111 షాపులు, 10 బార్లకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతి నెలా సుమారు 43,743 మద్యం కేసులు, 13,354 బీర్ కేసులు సరఫరా చేస్తున్నారు. దీని ప్రకారం మద్యానికి రూ.4.37 లక్షలు, బీర్లకు రూ.1.33 లక్షల మేర మందుబాబులు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ సొమ్ము మొత్తం మద్యం వ్యాపారుల జేబుల్లో చేరుతోంది.

దోపిడీయే పరమావధి

అందినకాడికి దండుకోడమే పరమావధిగా కూటమి నేతల ఆధ్వర్యంలోని మద్యం సిండికేట్ వ్యవహరిస్తోంది. ఎంఆర్‌పీకి మించి మద్యం విక్రయిస్తున్నా అరికట్టే నాథుడే కరువయ్యాడు. అధిక ధరలకు విక్రయించడమే కాదు.. ఇతర నిబంధనలను సైతం తుంగలో తొక్కుతున్నారు. ఒక వ్యక్తికి మూడు కంటే ఎక్కువ సీసాలు విక్రయించకూడదనే నిబంధన ఉన్నా.. ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మరింత ఎక్కువగా విక్రయిస్తున్నారు.

కన్నెత్తి చూడని ఎక్సైజ్

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా, విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం సిండికేట్లు ప్రతి నెలా ఒక్కో దుకాణానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ అందిస్తున్నట్లు సమాచారం. మద్యం విక్రయాల స్థాయిని బట్టి ఒక్కో మద్యం షాపు నుంచి ప్రతి నెలా రూ.10 వేల వరకూ ముట్టజెబుతున్నట్లు తెలిసింది. బెల్టు షాపుల నుంచి రూ.3 వేల వరకూ ఇస్తున్నట్లు సమాచారం.

స్థానిక సంస్థలకు రేపు ఉప ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని 12 గ్రామాల్లో ఉప సర్పంచ్, బిక్కవోలు ఎంపీపీ, పెరవలి, రంగంపేట మండలాల్లో ఇద్దరు కో ఆప్షన్ సభ్యుల పరోక్ష ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ ఎన్నికలను సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఎన్నికలకు సంబంధించిన అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లేశ్వరం (గోకవరం), పెనకనమెట్ట (కొవ్వూరు), పాత తుంగపాడు (రాజానగరం), కొవ్వూరుపాడు, వెంకటాయపాలెం (గోపాలపురం), తాళ్లపూడి, లక్ష్మీనరసాపురం (అనపర్తి), మర్రిపూడి (రంగంపేట), మురమండ (కడియం), మునికూడలి (సీతానగరం), ఉండ్రాజవరం గ్రామాల్లో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఏదైనా కారణంతో ఎన్నికల అధికారులు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించలేకుంటే తదుపరి రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించి జరపాలని స్పష్టం చేశారు. ఎన్నిక నిలిపివేస్తే దానికి కారణాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసి, మరో రోజు నిర్వహించేందుకు అనుమతించవచ్చని తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండాలని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నికకు ఒక్క సభ్యుడిని మాత్రమే ప్రతిపాదించాలని, మరో సభ్యుడు మద్దతు ఇవ్వాలని తెలిపారు. ప్రతిపాదించిన, మద్దతు పొందిన అభ్యర్థులందరి పేర్లు సమావేశ అధ్యక్షుడు చదివి వినిపించాలన్నారు. పోటీ చేస్తున్న వారు అదే రోజు ఉదయం 10 గంటల్లోగా నామినేషన్లు సమర్పించాలన్నారు. ఉపసంహరణకు అరగంట సమయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోగా పరిశీలన పూర్తి చేసి, అభ్యర్థుల జాబితా ప్రకటించాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఎన్నిక నిర్వహించాలన్నారు. ఒక్క అభ్యర్థి మాత్రమే వస్తే వారే ఎన్నికైనట్లు ప్రకటించాలన్నారు. ఎన్నిక జరిగితే ప్రతి అభ్యర్థి వచ్చిన ఓట్లను లెక్కించి, సమావేశ అధ్యక్షుడు ప్రకటించాలని జేసీ సూచించారు.

సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: ఫాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా రత్నగిరి వాసుడు సత్యదేవునికి అర్చకులు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పార్చన, 9 నుంచి 11 గంటల వరకూ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు, వేదాశీస్సులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, వేద పండితులు యనమంద్ర శర్మ ఘనపాఠి, అర్చకులు వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, కొండవీటి రాజా తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సత్యదేవుని దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామివారిని సుమారు 20 వేల మంది దర్శించారు. వెయ్యి వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆన్‌లైన్‌లో రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: పారామెడికల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి గత జనవరి 21న విడుదల చేసిన సవరించిన తాత్కాలిక మెరిట్ జాబితాను (రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టు) ఆన్‌లైన్‌లో ఉంచామని రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ జాబితా అందుబాటులో ఉందన్నారు. దీనిని అభ్యర్థులు పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 27, 28 తేదీలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య లిఖిత పూర్వక దరఖాస్తుపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో తమ కళాశాలలో సమర్పించాలని సూచించారు.

కదం తొక్కిన కోకో రైతులు

- కంపెనీలు కొనుగోలు చేయకపోవడంపై నిరసన
- తక్షణం ప్రభుత్వం కొనాలని విన్నపం
- కిలోకు రూ.900 ఇవ్వాలని డిమాండ్



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కోకో రైతులు

కొవ్వూరు: కోకో గింజల కొనుగోలు, గిట్టుబాటు ధరలపై నెల రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. కోకో గింజలను ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ కోకో కాయలు, గింజలు పట్టుకుని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. గేటు ఎదుట నిలబడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ కోకో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజలు కొనుగోలు చేయడం లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతుల వద్ద ఉన్న కోకో పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు మాట్లాడినప్పటికీ కంపెనీలు నిర్లక్ష్య ధోరణి చూపుతున్నాయని అన్నారు. అన్ సీజన్‌లో కోకో పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు, కౌలు రైతులు నష్టపోతున్నారన్నారు. మరోవైపు కంపెనీలు రోజురోజుకూ ధర తగ్గించేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం కిలో కోకో గింజల ధర రూ.650 ఉండగా నేడు రూ.550 నుంచి రూ.500కు పడిపోయిందని చెప్పారు. అన్ సీజన్‌లో కిలో రూ.200 నుంచి రూ.240కే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కిలో కోకో గింజలకు రూ.900 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వం ద్వారా వెంటనే కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని, విదేశీ కోకో గింజల దిగుమతులను నిలుపుదల చేయాలని, ఉద్యాన శాఖ నుంచి సబ్సిడీలు అందించి, రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డీఓ రాణి సుస్మితకు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఉండవల్లి కృష్ణారావు, జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరి.. జన కడలి





సమష్టి దివ్యబలి పూజ సమర్పిస్తున్న పీఠాధిపతులు జయరావు పొలిమెర, సగిలి ప్రకాష్, పిల్లి ఆంథోనీదాస్, సమష్టి దివ్యబలి పూజలో పాల్గొన్న భక్తులు

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- సమష్టి దివ్యబలి పూజ సమర్పించిన పీఠాధిపతులు
- అశ్వరథంపై ప్రదర్శన

దేవరపల్లి: నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల ముగింపు సందర్భంగా గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం జనసంద్రమే అయ్యింది. సోమవారం రాత్రి పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులు, ఫాదర్లు, పాస్టర్లు సాయంత్రం 6 నుంచి రాత్రి 2 గంటల వరకూ ప్రార్థనలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. పుణ్యక్షేత్రంలో క్రీస్తు నామం ప్రతిధ్వనించింది. పీఠాధిపతులు నిర్వహించిన దివ్యబలి పూజ సమర్పణ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని ఆశీస్సులు పొందారు.

అద్భుతాలకు నిలయం

అనేక అద్భుతాలకు నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం నిలయమని ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠం అపోస్తోలిక పాలనాధికారి మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర అన్నారు. మేరీమాత మహోత్సవాల సందర్భంగా పుణ్యక్షేత్రంలో జయరావు పొలిమెర, ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాష్, నెల్లూరు పీఠాధిపతి పిల్లి ఆంథోనీదాస్, పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్‌లు మంగళవారం రాత్రి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా అగ్ర పీఠాధిపతి జయరావు పొలిమెర మాట్లాడుతూ, అఖండ దేవాలయాన్ని నిర్మించుకుని 25 వసంతాలైందని అన్నారు. మన దేశం, ఉభయ తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని నిర్మలగిరి మేరీమాత కొండ వద్ద ప్రార్థిస్తున్నామని ఆయన తెలిపారు. ఏలూరు కథోలిక పీఠం పరిధిలోని గౌరీపట్నంలో మరియతల్లి.. నిర్మలగిరి మేరీమాతగా భక్తుల పూజలందుకుంటోందని చెప్పారు. బాధలతో ఉన్న అనేక మంది ఆ తల్లి చెంతకు చేరి ప్రార్థించగా, ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్ఖానాల్లో పని చేస్తున్న కార్మికులకు మంచి వేతనాలు లభించాలని ప్రార్థించామన్నారు. ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాష్ మాట్లాడుతూ, నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రజలందరి కోసం వెలసిన పుణ్యభూమి అని అన్నారు. సమైక్యతా స్థలంగా అలరారుతోందన్నారు. దైవానుభూతికి పుణ్యక్షేత్రం తార్కాణంగా, స్వర్గధామంగా ఉందని చెప్పారు. నెల్లూరు పీఠాధిపతి పిల్లి ఆంథోనీదాస్ మాట్లాడుతూ, రక్షణ చరిత్రలో మరియమాత ప్రధాన భూమిక పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, జి.మోజెస్, దిరిసిన ఆరోన్, పలువురు గురువులు, కన్యలు, భక్తులు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పీఠాల నుంచి పుణ్యక్షేత్రం మహోత్సవాలకు వచ్చిన పీఠాధిపతులు, గురువులకు పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ ఘన స్వాగతం పలికారు. మరియతల్లి స్వరూపం వద్ద పీఠాధిపతులు ప్రార్థన చేశారు. అనంతరం కొండపై నిర్మించిన 30 అడుగుల పునీత ఆంథోనీ స్వరూపాన్ని జయరావు పొలిమెర ఆవిష్కరించారు. వివిధ విచారణల నుంచి వచ్చిన బైబిల్ జ్యోతులను పీఠాధిపతులు స్వీకరించారు.

ఘనంగా జూబ్లీ వేడుకలు

పుణ్యక్షేత్రంలోని అఖండ దేవాలయం నిర్మించి, 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- దరఖాస్తు గడువు 31 వరకూ పొడిగింపు
- జిల్లా బీసీ సంక్షేమ అధికారి శశాంక



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మెగా డీఎస్సీ పరీక్షలకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 31 వరకూ పొడిగించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు బి.శశాంక మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)లో అర్హత సాధించిన జిల్లా వాసులు మాత్రమే దీనికి అర్హులన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు టెట్ అర్హత మార్కుల పత్రం, నేటివిటీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత పరచి ఆర్ట్స్ కళాశాలలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 939393 4825, 97053 26221, 90000 58102 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని శశాంక తెలిపారు.


బాంబు పేలుళ్లకు ఊడిన ఇంటి శ్లాబ్ పెచ్చులు


పేలుళ్లతో ఆందోళన చెందుతున్న కుమ్మరిలోవ గ్రామస్తులు


కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన సైరన్

దద్దరిల్లుతున్న కుమ్మరిలోవ

- రోజుకు మూడుసార్లు బాంబు పేలుళ్లు
- బీటలు వారుతూ, పెచ్చులు ఊడుతున్న గృహాలు
- అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్న స్థానికులు


కుమ్మరిలోవలో బాంబు పేలుళ్లకు బీటలు వారిన ఇంటి గోడ

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకంలో భాగంగా సాగుతున్న బాంబు పేలుళ్లతో కుమ్మరిలోవ గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. రోజుకు మూడుసార్లు పేలుతున్న బాంబులతో భూకంపం వచ్చినట్టు ఇళ్లు అదురుతుండడం, బీటలు వారడం, పెచ్చులు ఊడిపడుతుండడంతో గృహస్తులు ఆందోళన చెందుతున్నారు. పేలుళ్ల ధాటికి ఎప్పుడు గృహాలు కుప్పకూలిపోతాయోనని పిల్లాపాపలతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం పేలుళ్లకు ఇళ్ల సన్‌షేడ్లపై ఉన్న సామాన్లు కిందపడడంతో ఒక్కసారిగా ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశామని స్థానికులు గుడివాడ లోవరాజు, గుడివాడ నూకరాజు, చినలక్ష్మి, తాళ్లవలస బంగారయ్య, రాజబాబు, కచ్చాల సత్యనారాయణ, బొబ్బిలి నాగరత్నం, ఎస్.చినతల్లి, బొత్స వెంకట నాగమణి, మడ్డు నాగమ్మ, కచ్చాల సత్యనారాయణ తదితరులు పేర్కొన్నారు. పేలుళ్ల ధాటికి సన్‌షేడ్‌పై ఉన్న ఇత్తిడి సామాన్లు కింద పడడంతో నుదుటిపై స్వల్పంగా గాయమైనట్టు గుడివాడ చినలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. పిల్లలు భయంతో పరుగులు తీస్తున్నారన్నారు. 20 రోజులుగా పేలుళ్లు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, స్థానిక నాయకులకు ఫిర్యాదు చేస్తే సంబంధిత కాంట్రాక్ట్ సిబ్బంది వచ్చి సైరన్ ఏర్పాటు చేశారని, సైరన్ మోగినప్పుడు అరగంట సేపు జాగ్రత్తగా ఉండాలని సూచించి వెళ్లిపోయారన్నారు. నాలుగైదు వందల మీటర్ల దూరంలో పేలుళ్లు జరుగుతున్నా మా ఇళ్ల వద్ద కంపిస్తోందని, ఇళ్లు బీటలు వారడంతో ఎప్పుడు కూలిపోతాయోనని భయం భయంగా ఉంటున్నామన్నారు. పాత ఇళ్లే కాకుండా ఇటీవల నిర్మించిన కొత్త ఇళ్లకు సైతం పగుళ్లు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా బాంబులు పేల్చితే తమ ఇళ్లు కూలిపోతాయని, ఇళ్లకు, తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. వీఆర్వోను పంపించి సమాచారాన్ని సేకరిస్తామని, నివేదికను ఉన్నత అధికారులకు పంపిస్తామన్నారు. పోలవరం ఇరిగేషన్ ఈఈ బి.గోవిందును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. కంట్రోలింగ్ బ్లాస్టింగ్ చేపట్టే అంశాలను పరిశీలించేందుకు బుధవారం ఆ ప్రాంతంలో ఎస్ఈ పర్యటిస్తారన్నారు. గ్రామస్తులు ఆందోళన చెందొద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

లీక్‌పై అవగాహన అవసరం

పోచవరం వద్ద హెచ్‌పీసీఎల్, గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో మాక్ డ్రిల్


పోచవరం వద్ద హెచ్‌పీసీఎల్, గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్

తాళ్లపూడి: ఆయిల్, గ్యాస్‌పైపు లైన్ వెళుతున్న భూములలో రైతులు ఏ విధమైన తవ్వకాలు చేయరాదని, పైప్‌లైన్ లీకయిన సమయంలో తమకు తక్షణం సమాచారం ఇవ్వాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాథరావు అన్నారు. మండలంలోని పోచవరం వద్ద మంగళవారం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) ఆధ్వర్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. వైజాగ్ నుంచి విజయవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు భూమి లోపల పక్కపక్కనే వెళుతున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్, గెయిల్ గ్యాస్ పైప్‌లైన్‌లు ఉన్న ప్రాంతంలో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు, ప్రజలకు, సమీపంలోని ఫ్యాక్టరీల సిబ్బందికి అవగాహన కల్పించారు. పంట పొలాల్లోంచి వెళ్లిన పైప్ లైన్ లీక్ అయితే ఆ ఏరియాలో వుండే ప్రతినిధికి సమాచారం అందిస్తే వెంటనే ఫైర్ ఇంజన్, పెట్రోల్‌ను నింపుకునే వాహనం, అంబులెన్స్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి ప్రమాదాన్ని ఎలా నివారిస్తారో ప్రత్యక్షంగా చేసి చూపారు. లీకవుతున్న పెట్రోల్, మంటలను అదుపు చేసే విధానాలను, గాయపడిన వారిని తరలించడం తెలియజేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ వాణిధర్ రామన్, డీఎఫ్‌వో మార్టిన్ లూథర్ కింగ్, హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ పంకజ్ కుమార్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, గెయిల్ డీజీఎం ఎం.భట్టాచార్య, ఆర్‌టీవో సీహెచ్ సంపత్ కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, తాళ్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక గుప్తా, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి బీఆర్వో సాయి, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీను పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ లో పాల్గొన్న అధికారులు, సంస్థల ప్రతినిధులు

కారు ఢీకొని వ్యక్తి మృతి


సిగిరెడ్డి రాంబాబు (ఫైల్)

జగ్గంపేట: మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీ కొన్న ప్రమాదంలో మంగళవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట లారీ వర్కర్స్ అండ్ యాజమాన్య సంఘం కార్యదర్శిగా వున్న సిగిరెడ్డి రాంబాబు ఉదయం, జగ్గంపేట శివారు రామవరం వద్ద వున్న యూనియన్ ఆఫీసుకు తన స్కూటీ పై వస్తున్నారు. ఈ నేపథ్యంలో వెనుక నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి రాంబాబును ఢీ కొనడంతో ఆయన తలకు తీవ్రగాయమై అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి కొడుకు, కూతురు వుండగా భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి కుమారుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

అమ్మ, నాన్నకు ప్రేమతో..

- రూ.10 లక్షలతో తల్లిదండ్రులకు ఆరాధ్య మందిరం
- ప్రేమ చాటుకున్న తనయుడు
- నేడు తల్లి ప్రథమ వర్ధంతి
- మందిరం, విగ్రహాల ఆవిష్కరణ

కొత్తపేట: అమ్మ కురిపించే ఆప్యాయత, అనురాగం, ఆనందం హృదయానికి గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. నాన్నలోని హుందాతనం, సంతానంపై కనపడకుండా కడుపులో దాచుకున్న ప్రేమ ఈ ప్రపంచాన్నే మరిపింపజేస్తాయి. అటువంటి తల్లిదండ్రులకు ఏకంగా ఆరాధ్య మందిరమే నిర్మించారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బొరుసు వారిసావరం గ్రామానికి చెందిన బొరుసు వెంకట ఉదయ భాస్కర్. తపాలా శాఖలో పని చేసిన చంద్రరావు - పూర్ణచంద్ర కళావతి దంపతుల కుమారుడైన భాస్కర్.. ప్రముఖ జాతీయ స్థాయి నిర్మాణ సంస్థలో కీలక స్థానంలో పని చేశారు. ఆ కంపెనీలో అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, ఆయా కుటుంబాలకు కూడా ఓ దారి చూపారు. భాస్కర్ తండ్రి 2000 సంవత్సరంలో మృతి చెందారు. అనంతరం భాస్కర్ తన తల్లిని కంటికి రెప్పలా చూసుకున్నారు. ఆమె స్ఫూర్తి, ప్రోత్సాహం, సూచనల మేరకు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బొరుసువారి సావరం వద్ద కౌశిక తీరాన కనకదుర్గాదేవి గుడిని రూ.కోటితో పునర్నిర్మించారు. కొత్తపేట గ్రామ పరిధిలోని తొలి దుర్గాదేవి గుడి ఇదే కావడం విశేషం. ప్రతి నెలా పౌర్ణమి నాడు మహిళలతో ఇక్కడ సామూహిక కుంకుమ పూజలు, అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే ఆ ఆలయానికి సమీపాన బొబ్బర్లంక - అమలాపురం ప్రధాన పంట కాలువ పరీవాహక ప్రాంతంలో ఉద్యానవనం, గ్రామస్తుల సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి రూ.వేలు, రూ.లక్షల్లో ఆర్థిక సహాయం అందించారు. అనేక దానధర్మాలు చేశారు.. చేస్తున్నారు. భాస్కర్ తల్లి కళావతి గత ఏడాది ఏప్రిల్ 5న కాలం చేశారు. అనంతరం తల్లిదండ్రుల స్మృతిలో భాస్కర్ తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మరణించిన అనంతరం కూడా తల్లిదండ్రులు తన కళ్ల ముందే ఉండాలని ఆయన భావించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న తన వ్యవసాయ క్షేత్రం, ఫామ్ హౌస్ ప్రాంగణంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో తల్లిదండ్రులు చంద్రరావు - పూర్ణచంద్రకళావతి కాంస్య విగ్రహాలు నెలకొల్పారు. వాటికి గ్రానైట్ రాయితో అందమైన మందిరం నిర్మించారు. జీవకళ ఉట్టిపడేలా ఈ విగ్రహాలను స్థానిక ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ తీర్చిదిద్దారు. తల్లి కళావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 26న ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.


కొత్తపేటలో బొరుసు చంద్రరావు - పూర్ణచంద్ర కళావతి దంపతుల ఆరాధ్య మందిరం


బొరుసు చంద్రరావు - పూర్ణచంద్రకళావతి విగ్రహాలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పాస్టర్ మృతిపై అనుమానాలు


సంఘటన స్థలంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతదేహం


ప్రభుత్వాసుపత్రి వద్ద మాట్లాడుతున్న పాస్టర్ సబ్బెళ్ల విజయప్రసాద్‌రెడ్డి

- అది రోడ్డు ప్రమాదం కాదు హత్య అని క్రైస్తవ సంఘాల ఆరోపణ
- రాజమహేంద్రవరం చేరుకున్న రాష్ట్రంలోని ప్రముఖ పాస్టర్లు


పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/రాజానగరం: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అయితే, ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందలేదని, హత్య చేశారంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ అవడం ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో నయరా పెట్రోలు బంకు ఎదురుగా కొంతమూరు సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ పగడాల మృతి చెందారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన వ్యక్తిగత పనులపై ఇటీవల రాజమహేంద్రవం వచ్చారు. ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తున్న ఆయనను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో, ఆయన బైకుతో సహా రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లో పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం స్థానికుల ద్వారా మంగళవారం తెలుసుకున్న రాజమహేంద్రవరంలోని బొమ్మూరుకు చెందిన అతని సన్నిహితుడు జనగామ రోహన్ ఉదయం 11 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, జీవీ హర్షకుమార్, పాస్టర్లు సబ్బెళ్ల విజయప్రసాద్‌రెడ్డి, జాన్‌వెస్లీ, స్థానిక రాజకీయ నాయకులు అక్కడకు చేరుకుని, ప్రవీణ్‌కుమార్ మృతిపై లోతైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయం చేయాలంటున్న క్రైస్తవ సంఘాలు

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతి చెందిన విషయం తెలిసిన రాష్ట్రంలోని క్రైస్తవ సంఘాల సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. పాస్టర్లు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆసుపత్రి, పరిసర ప్రాంతాలన్నీ పూర్తిగా కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని, దీనిపై పలు అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాలు ఆరోపించాయి. పాస్టర్ సబ్బెళ్ల విజయప్రసాద్‌రెడ్డి, పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ రక్షణ టీవీ వేదికగా ఎన్నో డిబేట్‌లు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్ మృతి అనుమానాస్పదంగా ఉందన్నారు. ఆయన తలకు బలమైన గాయాలున్నాయన్నారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని పోలీసులను కోరామన్నారు. తొలుత యాక్సిడెంట్ అని చెప్పారని, అయితే ప్రవీణ్ తలకు తీవ్రమైన గాయాలున్నాయని, దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని పోలీసులను కోరామన్నారు. ప్రమాద స్థలంలో ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదని, మా అనుమానాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించాలన్నారు. ప్రవీణ్ కుమార్ కో ఆర్డినేటర్ రాజమహేంద్రవరంలో ఉన్నారని, ఆయన సోమవారం నుంచి ఫోన్ చేస్తుంటే లిఫ్ట్ చేయలేదన్నారు. ఇదిలావుండగా పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత

క్రైస్తవ సంఘాలు మంగళవారం రాత్రి ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించాయి. ఇప్పటివరకు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, పోస్టుమార్టం ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ ప్రశ్నించారు. వందల సంఖ్యలో క్రైస్తవులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళన నిర్వహించడంతో ఆ ప్రాంతంలో భారీగా పోలీసులు మోహరించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహిస్తారని, ఆ సమయంలో పాస్టర్ తరఫున ఒకరిని అనుమతిస్తామని, అదంతా వీడియో చిత్రీకరణ చేస్తామని, తమకు సహకరించాలని పోలీసులు కోరడంతో ఆందోళన విరమించారు.

నిజానిజాలు వెలికితీస్తాం

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఎటువంటి అపోహలు, అసత్యాలు, సృష్టించవద్దని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాస్టర్ మృతిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ కొనసాగిస్తున్నామన్నారు. త్వరలోనే నిజానిజాలను వెలికి తీస్తామన్నారు. అసత్య ప్రచారాలు చేసి, మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు చేపడతామన్నారు.

సమగ్ర విచారణ చేయాలి

సాక్షి, అమరావతి: క్రైస్తవ బోధకుడు పనగల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రవీణ్ క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నాడనే కారణంతో కొంతమంది దుండగులు ఆయన మృతికి కారణమయ్యారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఇలా షెడ్ చేసుకున్నారు!

- సచివాలయం ఆవరణలో కారు షెడ్డు నిర్మించిన తెలుగు తమ్ముడు
- తమ్ముడికి అండగా అక్క
- కళ్లు మూసుకున్న అధికార యంత్రాంగం


బొమ్మూరు రాఘవేంద్రనగర్‌కాలనీ గ్రామసచివాలయం -3 వెనుక షెడ్డు నిర్మాణం చేసి కారు పెట్టిన దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో చెలరేగిపోతున్న అక్రమార్కులు.. తమ వ్యవహారాలకు అధికారాన్ని అడ్డం పెట్టుకుంటున్నారు. ఈ బరితెగింపు ఏ స్థాయికి చేరిందంటే ప్రభుత్వ భవనాల ప్రాంగణాలను కూడా అక్రమించుకునేంత వరకు వెళ్లిపోయింది. ఇటీవల బొమ్మూరు గ్రామంలోని శ్మశానంలో 30 వేప చెట్లు అక్రమంగా అమ్మేసుకోవడం, రజకుల చెరువు గట్టుపై తుమ్మచెట్లను అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా తొలగించి సొమ్ము చేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు తాజాగా బొమ్మూరు రాఘవేంద్రనగర్‌కాలనీలోని సచివాలయం-3 ప్రాంగణంలో ఆ ప్రాంత తెలుగు తమ్ముడు రేకులతో షెడ్డును నిర్మించి, అందులో కారును పెట్టుకుంటూ తమ ఘనతను చాటుకుంటున్నారు. ఇదేదో తాత్కాలికంగా పార్కింగ్ చేసుకుంటున్నారనుకునేరు.. పక్కాగా షెడ్డును నిర్మించి మరీ శాశ్వత పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోవడాన్ని చూసిన గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. మరో అడుగు ముందుకేసి కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ తెలుగు తమ్ముడు మాత్రం పైనుంచి కింద వరకు మాదే అధికారం మమ్మల్ని ఎవడ్రా ఆపేది అంటూ.. కారును, షెడ్డును మాత్రం అలాగే ఉంచేశాడు. సదరు ఆక్రమణ దారుడికి తోడు రూరల్ నియోజకవర్గంలో నెంబర్ 2 నేనే అంటూ చెప్పుకుంటున్న అక్క కూడా అండగా ఉన్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. సదరు అక్క నేరుగా గ్రామ ప్రత్యేకాధికారి అయిన నగరపాలకసంస్థ కమిషనర్‌కు ఈ షెడ్డు జోలికి వెళ్లొద్దంటూ రికమెండ్ చేశారంటున్నారు. దీంతో ఇక మాకేం అడ్డు అనుకుంటూ కారును దర్జాగానే పార్క్ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై తగు చర్యలు చేపట్టకపోతే.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కమిషనర్ కార్యాలయం వద్దకే ప్రజాందోళన చేరేలా కన్పిస్తోంది.

వివాహిత అదృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక సుబ్బారాయుడి చెరువు ప్రాంతానికి చెందిన వివాహిత (37) ఈ నెల 22వ తేదీన అదృశ్యమైంది. భర్త సరిగా పట్టించుకోవడం లేదని, పిల్లలతో గొడవ పడి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఐ.పోలవరానికి చెందిన వివాహిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు.

కాలువలోకి దూకిన యువకుడు


పెరవలి వద్ద నరసాపురం కాలువలో వలలు వేసి వెతుకుతున్న దృశ్యం


పెరవలి వద్ద కాలువలో దూకిన దుర్గారావు

పెరవలి: ఓ వ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర సంచలనం రేపింది.పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు (29) మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెరవలి లాకుల వద్దకు వచ్చి బండి, జోళ్లు విడిచిపెట్టి కాల్వలోకి దూకేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు దుర్గారావుకి వెదురుగెడ ఇచ్చినా, దానిని పట్టుకోకుండా నీట మునిగిపోయాడని తెలిపారు. స్థానికులు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు తణుకు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడ నుంచి సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చారు. ఇదే సమయంలో పోలీసులు గజ ఈతగాళ్లను, వలలు వేసే వారిని రప్పించి వెతకటం ప్రారంభించారు. రాత్రి అవ్వటంతో వెతకటం నిలుపుదల చేశామని, బుధవారం ఉదయం తిరిగి వలలు వేస్తామని తెలిపారు. మృతుడి అన్న చల్లా వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.



స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు.
అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు.
కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది.
సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు.
స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్
తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు.
రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు అకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.



కృష్ణకుమారి

వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది



కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. "మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి." అన్నారు కృష్ణకుమారి.

మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే

నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్





తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్

మొటిమలు, మచ్చలు పోవాలంటే...



ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



లీగల్

పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు "నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది" కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సెలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్లైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్లి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం

పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

> **సామాజిక సేవే... విలువైన సంపద**
>
> న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.
>
> – సరళ మహేందర్‌రెడ్డి

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.



ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండుసార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్


జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!

విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి. ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.




ఆర్ట్ అండ్ కల్చర్

పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్ లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్శిటీ (జీసియూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.



'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!